క్లుప్తంగా

వినాయక మండపాలకు బియ్యం పంపిణీ



కమిటీ నిర్వాహకులకు బియ్యం అందిస్తున్న శ్రీనివాస్

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేటలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు బీజేపీ యువ నాయకుడు పాలాది శ్రీనివాస్ బియ్యం పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో 15 వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. అన్ని మండపాల వద్ద నిర్వాహకులకు ఆయన 50 కిలోల చొప్పున బియ్యం అందించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తట్టెపల్లి నర్సింహ, యాదగిరి, రాజు, శివ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌ఫిల్టర్ అందజేత



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్ ప్రాథమిక పాఠశాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాజిద్ వాటర్ ఫిల్టర్ అందించారు. సోమవారం పలువురు నాయకులతో కలిసి ఆయన ఫిల్టర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. చదువుల్లో రాణించి గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ్, ఉపాధ్యాయులు శ్వేత, శివలీల, గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, సోమరాజు, అశోక్, సురేశ్, జంగయ్య, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి

చేవెళ్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి సొంత నిధులతో మరమ్మతులు చేయించాడు. మున్సిపాలిటీ పరిధిలోని పామెన వార్డులో పామెన గేట్ నుంచి వార్డుకు వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలను సోమవారం తన సొంత నిధులతో మట్టి పోయించి పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రజలు అభినందించారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో రూ.60లక్షలతో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ముట్పూర్‌లో రూ.4లక్షలతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అంతకుముందు కొందుర్గు బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో మండలంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, రామయ్యగౌడ్, జితేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, దర్శన్‌గౌడ్, కృష్ణయ్య, నర్సింలు, అంజయ్య, రవి, ద్విజేందర్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సోషల్ మీడియా కో–ఆర్డినేటర్లు

చేవెళ్ల: యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా అసెంబ్లీ, మండల కో–ఆర్డినేటర్లుగా నూతనంగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సోషల్ మీడియా కో–ఆర్డినేటర్లు ప్రభుత్వ క్యాంపు కార్యాలయం వద్ద ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించి శాలువాలతో సన్మానించారు. యూత్ కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ కో–ఆర్డినేటర్‌గా పి. మహేశ్వర్‌రెడ్డి, మండల కో–ఆర్డినేటర్లుగా వెంకటేశ్, పి.ప్రశాంత్‌రెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు. యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు జనార్దన్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, పాండుగౌడ్, ప్రభాకర్, నర్సింలు, బీమయ్య, మల్లేశ్, చాన్‌పాషా, నరేందర్ తదితరులు ఉన్నారు.

పల్లెల్లో పంచాయతీ సందడి

- ఎక్కడ చూసినా ఎన్నికలపైనే చర్చ
- రిజర్వేషన్లపై ఉత్కంఠ



కొత్తూరు ఎంపీడీఓ కార్యాలయం

కొత్తూరు: ఇటీవల హైకోర్టు పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీనికి అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల నిర్వహణకు కార్యాచరణ ప్రారంభించింది. దీంతో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్ వార్డు సభ్యులుగా పోటీలో ఉండాలనుకుంటున్న ఆశావాహులు అన్ని విధాలుగా ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎన్నికల నిర్వహణపై కేబినేట్, ఇతర సమావేశాలు నిర్వహించడంతో దాదాపుగా ఎన్నికలు నిర్వహిస్తారనే ఆశావాహులు భావిస్తూ అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కేడర్‌ను కాపాడుకుంటున్న ఆశావహులు

మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాలు, సుమారు 20 వేల జనాభా ఉన్నారు. 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు జరగగా గెలుపొందిన వారికి 2024 జనవరి 31తో పదవీ కాలం ముగిసింది. ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు సైతం 2019 జూన్‌లో జరగగా 2024 జూన్ 03 వీరి పదవీకాలం ముగిసింది. కాగా అప్పటికే పదవీకాలం ముగిసిన వారితో పాటు కొత్త ఆశావహులు ఎన్నికల బరిలో ఉండడానికి సిద్ధమై కేడర్‌ను బలోపేతం చేసుకుంటున్నారు.

ఎన్నికలపై చర్చ

హైకోర్టు సూచన, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనతో దాదాపుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతోంది. దానికి తోడు ఇటీవల అధికారులు డ్రాఫ్ట్ ఓటరు జాబితాను సైతం విడుదల చేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడా చూసిన ఎన్నికలపై చర్చ జోరుగా కొనసాగుతోంది. రిజర్వేషన్లపై ఇంకా స్పష్టత లేకపోవడంతో ఆశావాహులు తమ కేడర్‌తో మంతనాలు జరుపుతున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. కులగణన నిర్వహించినప్పటికీ దీనికి సంబంధించిన బిల్లుపై స్పష్టత లేదు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలతో గతంలో ఉన్న రిజర్వేషన్ల మేరకే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతోంది.

మండలంలో ఓటర్ల వివరాలు	
గ్రామ పంచాయతీలు	12
అనుబంధ గ్రామాలు	09
మొత్తం ఓటర్లు	16,713
పురుషులు	8,394
మహిళలు	8,318
ఇతరులు	01
ఎంపీటీసీ స్థానాల సంఖ్య	06
జెడ్పీటీసీ స్థానాలు	01
పంచాయతీ వార్డులు	110
పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలు	110

ఆర్టీసీ బలోపేతానికి చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి సోమవారం ఆయన బస్సును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. గత పాలకులు ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కరోనా సమయంలో దేవునిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారని, దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రతి రోజు బస్సు శ్రీరంగాపూర్, చిన్నఎల్కిచర్ల, పుల్లప్పగూడ, అయోధ్యాపూర్‌తండా గ్రామాల మీదుగా దేవునిపల్లి గ్రామానికి చేరుకుంటుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు నడపనున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ డిపోకు ఇటీవల కొత్త బస్సు తీసుకొచ్చామని, అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, మంగులాల్‌నాయక్, పురుషోత్తంరెడ్డి, శివ, సాయిలు, నర్సింలు, అరుణ్‌కుమార్, శ్రీకాంత్, సునీల్, నర్సింహ, జహంగీర్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం



గాజులగూడలో ప్రీప్రైమరీ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ అక్బర్

శంకర్‌పల్లి: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ, ఎంఈఓ అక్బర్ అన్నారు. సోమవారం మండలంలో ఎంపిక చేసిన మహాలింగాపురం, గాజులగూడ, మాసానిగూడ, అంతప్పగూడ, జన్వాడలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్లు నిండిన చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో మహాలింగాపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మున్వర్ సుల్తానా, ఉపాధ్యాయులు ప్రశాంత్, విమలమ్మ, గాజులగూడెం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ శ్మశానవాటికకు స్థలం ఇవ్వొద్దు



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: మండలంలోని కొడిచర్లతండా సమీపంలో సర్వే నంబర్ 198లో ఉన్న ప్రభుత్వ భూమిలో క్రిస్టియన్ శ్మశానవాటిక, కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ తండావాసులు సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమతండా స్థలం భవనాలకు కేటాయిస్తే భవిష్యత్ అవసరాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గతంలోనే పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతంలో క్రిస్టియన్ కమ్యూనిటీకి స్థనికంగా స్థలం కేటాయించొద్దని కోరారు. కార్యక్రమంలో తండావాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

చేవెళ్ల: గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వ స్థలాలు కేటాయించి.. పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ కృష్ణయ్యకు సీపీఐ నాయకులు న్యాలట రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూమి 7 ఎకరాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని న్యాలట రెవె న్యూ పరిధిలోని సర్వే నంబర్ 240లో 7 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో ఆ రెవెన్యూ పరిధిలోనే ఉన్న న్యాలట, సింగప్పగూడ, రామన్నగూడ గ్రామాల్లోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలోనే ఈ సర్వే నంబర్‌లో కొంత మంది పేదలకు ప్లాట్లు చేసి ఇచ్చారన్నారు. కానీ ఈ ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. మరికొంత నాయకులు ప్లాట్లు ఉన్నాయని, అమ్మకాలు కూడా చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్తిరెడ్డి, ఎండీ.మక్బూల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, కృష్ణ, పాపయ్య, శివ, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పాత విద్యుత్ వైర్లను తొలగించాలని వినతి

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో కాలం చెల్లిన పాత విద్యుత్ వైర్లను తొలగించి, కొత్త వైర్లను బిగించాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం శంకర్‌పల్లి విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్‌కు ఆయన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రవీందర్, మహేందర్‌రెడ్డి, వైభవ్ పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పటేల్ రోడ్డు ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను ఆయన పలువురు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని, సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇందుకు గాను ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను మంజూరు చేయిస్తున్నారని, అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖదీర్, మన్నె రవి, షఫ్రోద్దీన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



షాద్‌నగర్‌రూరల్: నిరసన తెలుపుతున్న పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు



శంకర్‌పల్లి: ఇందిరా పార్కు వద్ద శంకర్‌పల్లికి చెందిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి.. ఓపీఎస్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ సోమవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఫరూఖ్‌నగర్ మండలం నుంచి దాదాపు 300ల మంది ఉపాధ్యాయులు మహాధర్నాకు తరలివెళ్లారు. నలుపురంగు షర్టులను ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం అమలు ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు తరలిన వారిలో పీఆర్టీయూ నాయకులు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

కొందుర్గు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో సోమవారం టీఎస్ యూటీఎఫ్ నాయకులు సోమవారం కొందుర్గు, చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్, గంగన్నగూడ తదితర పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు సంఘటితమై పోరాడితేనే సమస్యలు తీరుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు కోసం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎం గోపినాథ్, ఉపాధ్యాయులు వీరేశం, సుధాకర్, హేమలత, మానస, శిరీష, వనిత, నీరజ పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం

శంకర్‌పల్లి: సీపీఎస్ రద్దు కోసం సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ధర్నా విజయవంతమైనట్లు పీఆర్టీయూ టీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యం, బాల్‌రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్నాలో శంకర్‌పల్లికి చెందిన ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొన్నామని, నలుపు రంగు చొక్కాలు ధరించి నిరసన వ్యక్తం చేసినట్లు స్పష్టం చేశారు. సీపీఎస్ రద్దుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం



నేత్రదానంపై ప్రజెంటేషన్ ఇస్తున్న విద్యార్థినులు

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె

షాద్‌నగర్‌రూరల్: మన శరీరంలోని అన్ని అవయవాల్లో నేత్రాలు ఎంతో ప్రధానమైనవని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. నేత్రదానం పక్షోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేత్రదానంపై పీపీటీ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కళ్లు లేకపోతే ఈ లోకాన్ని చూడలేకపోతామని, మన ఎదుట ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంటుందన్నారు. నేత్రదానంతో కళ్లు లేనివారికి కంటి చూపునివ్వొచ్చన్నారు. మరణాంతరం మన అవయవాలను దానం చేస్తే మరొకరికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని సూచించారు. నేత్రదానంపై అపోహలు పెట్టుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ కళ్లను దానం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



చేవెళ్ల పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా కోసం వచ్చిన రైతులు



మొయినాబాద్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద గుమిగూడిన రైతులు

- ఎరువుల దుకాణాల వద్ద క్యూ
- స్టాక్ సరిపోకపోవడంతో నిరాశగా వెనుదిరిగిన రైతులు

చేవెళ్ల: యూరియా కొరతతో మండలంలోని రైతులకు తిప్పలు తప్పటం లేదు. ప్రభుత్వం యూరియాను సరఫరా చేస్తున్నామని చెబుతున్నా విడతల వారీగా వస్తున్న స్టాక్‌తో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం చేవెళ్ల సొసైటీలోకి 20 టన్నులు (450బస్తాల) యూరియా వచ్చింది. మండలంలో ఇతర సొసైటీలలో ఎక్కడ యూరియా లేకపోవటంతో చేవెళ్ల సొసైటీ వద్దకు పెద్దసంఖ్యలో రైతులు రావటంతో వచ్చిన స్టాక్ మధ్యాహ్నం వరకు అయిపోయింది. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇచ్చిన కూడా యూరియా సరిపోలేదు. స్టాక్ మళ్లీ వస్తుందని అధికారులు చెప్పటంతో నిరాశగా వెనుదిరిగారు. ఆలూరు, మూడిమ్యాల పీఏసీఎస్ సొసైటీలకు 20 టన్నుల చొప్పున 40 టన్నులు, చేవెళ్ల సొసైటీకి 20 టన్నులు, మొత్తం 60 టన్నుల యూరియా రెండు రోజుల్లో పంపిణీ చేశారు. ఇప్పటివరకు ఖరీఫ్‌కు 750 మెట్రిక్ టన్నులు వచ్చిందని.. మరో 500ల మెట్రిక్ టన్నుల వరకు ఈ ఏడాది నవంబర్ వరకు రావాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తెలిపారు.

నాలుగు గంటల్లో ఖాళీ

మొయినాబాద్: మొయినాబాద్‌లో యూరియా కోసం రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. మొయినాబాద్ పీఏసీఎస్‌కు సోమవారం ఉదయం 400 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. రైతులందరూ ఒకేసారి రావడంతో ఎవరికి ఇవ్వాలో అర్థం కాక సిబ్బంది కొంతసేపు ఇబ్బంది పడ్డారు. రైతులందరి ఆధార్ కార్డులు తీసుకొని ఒకరికి 2 బస్తాల చొప్పున ఇచ్చారు. నాలుగు గంటల్లో మొత్తం యూరియా అయిపోయింది. ఆలస్యంగా వచ్చిన రైతులకు యూరియా దొరకలేదు. రెండు రోజుల్లో మళ్లీ యూరియా వస్తుందని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి అనురాధ తెలిపారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 6వ రోజు సోమవారం బొజ్జగణపయ్యకు భక్తులు, ఉత్సవ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లు, వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి ఉండ్రాలయ్యా.. దయుంచయ్యా అంటూ వేడుకున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పలు గ్రామాల్లో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలు హోరాహోరీగా కొనసాగాయి.



షాబాద్: ముద్దెంగూడలో..



చేవెళ్ల: రెడ్డి అసోషియేషన్ వినాయకుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల: కందవాడలో వినాయకుడి లడ్డూ దక్కించుకున్న అర్జున్‌రెడ్డి



షాబాద్: తిర్మలాపూర్‌లో లడ్డూ దక్కించుకున్న తిమ్మనోళ్ల రాఘవేందర్‌రెడ్డి



చేవెళ్ల: న్యూ జర్నలిస్ట్ కాలనీలో..



కేశంపేటలో..



షాద్‌నగర్: అన్నదాన కార్యక్రమం



శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో..



కొత్తూరు: వినాయకుడి పూజలో పాల్గొన్న మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో..